వాయిస్ టుడే Special
www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com
జనగాత్రం - మనసేత్రం
Follow
సోమవారం, 27 ఆగష్టు, 2024
HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD



# బండికే మళ్లీ తెలంగాణ బీజేపీ పగ్గాలు?

## సంజయ్ వైపు మొగ్గుచూపుతున్న అగ్ర నాయకత్వం

- దక్షిణాది అంతటిలో బలమైన నేతగానూ గుర్తింపు
- ఆయన సారథ్యంలోనే గతంలో తెలంగాణలో బలం
- అసెంబ్లీ ఎన్నికల ముందు మార్పుతో ఇబ్బందులు
- ఆ ప్రభావాన్ని గుర్తించిన బీజేపీ జాతీయ నాయకత్వం
- తిరిగి సంజయ్ ను నియమించే దిశగా కసరత్తులు
- బీసీ నేతను గుర్తించినట్లు కూడా అవుతుందని లెక్క
- ఇప్పటికే ఎస్సీల్లో మాదిగలను ఆకర్షించిన కమలం

తెలంగాణ బీజేపీ నాయకత్వం మళ్లీ బండి సంజయ్ చేతుల్లోకి రానుందా? తెలంగాణ సారథ్య పగ్గాలను ఆయనకు ఇవ్వడమే సరైనదని భావిస్తోందా..? రాజకీయంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ లను ఎదుర్కొనే సత్తా సంజయ్ కే ఉందని భావిస్తోందా..? సామాజిక సమీకరణాల ప్రకారంగానూ బండిని నడిపించగల సామర్థ్యం సంజయ్ కే సొంతమని భావిస్తోందా? ఈ ప్రశ్నలన్నింటికీ ఔననే సమాధానాలు వస్తున్నాయి. తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా, కేంద్ర మంత్రిగా రెండు కీలక బాధ్యతల్లో ఉన్న కిషన్ రెడ్డి స్థానంలో మళ్లీ కరీంనగర్ ఎంపీ, కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ను నియమించే దిశగా ప్రయత్నాలు సాగుతున్నట్లు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

వాయిస్ టుడే హైదరాబాద్ ప్రత్యేక ప్రతినిధి

### దక్షిణాదిన దమ్ము చూపేలా

దశాబ్దాలుగా ప్రయత్నాలు సాగిస్తున్నా.. దక్షిణాదిన బీజేపీ పుంజుకోలేకపోతోంది. కర్నాటకలో బలపడినట్లే కనిపించినా.. అధికారం కోల్పోయింది. ఇక ఏపీలో టీడీపీ-జన సేన పొత్తుతోనే కాస్త ఉనికి. తమిళనాడులో ఆ పార్టీకి చోటే లేదు. కేరళలో ఎలాగో సురేశ్ గోపీ గెలిచినా ఆయన సినిమాలు ముఖ్యమంటూ గోడమీద పిల్లిలా వ్యవహరిస్తున్నారు. కానీ, తెలంగాణ వీటన్నిటికీ భిన్నం. 2020-23 మధ్య బండి సంజయ్ సారథ్యంలో బీజేపీ తెలంగాణ ఉవ్వెత్తున్న లేచింది. దుబ్బాక, హుజూర్ నగర్ లలో గెలిచింది. జీహెచ్ఎంసీని కైవసం చేసుకునేలా కనిపించింది. ఇదే ఊపులో అసెంబ్లీ ఎన్నికల్లోనూ ప్రభావం చూపేలా కనిపించింది. అయితే, సరిగ్గా ఎన్నికలకు నాలుగు నెలల ముందు సంజయ్‌ను తప్పించిన బీజేపీ.. పెద్ద పొరపాటు చేసింది. 8 సీట్లకే పరిమితమైంది. మరో 17 చోట్ల రెండో స్థానంలో నిలిచింది. అదే సంజయ్ ను కొనసాగించి ఉంటే ఫలితాలు భిన్నంగా వచ్చేవని చాలామంది వ్యాఖ్యానించారు. అంటే.. బీజేపీకి దక్షిణాదిలో ఉన్న బలమైన, ప్రజాదరణ ఉన్న నాయకుడు బండి సంజయ్ అనడంలో సందేహం లేదు.

### గుర్తించిన జాతీయ నాయకత్వం

సంజయ్ ను తప్పించడం ఎంత పొరపాటో బీజేపీ జాతీయ నాయకత్వం గుర్తించిందని.. అందుకే ఆయనను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా తిరిగి నియమించే అంశాన్ని పరిశీలిస్తోందని చెబుతున్నారు. అయితే, పార్టీ నాయకత్వం మాటే శిరోధార్యంగా భావించే సంజయ్ మాత్రం తనకు వచ్చిన అవకాశమే ముఖ్యమనే ధోరణితో ఉన్నారు. కాగా, సంజయ్ ను తిరిగి నియమించడం వెనుక బీజేపీ అగ్ర నాయకత్వం ఆలోచన మరోలా కూడా ఉంది. బీసీ అందులోనూ తెలంగాణలో ప్రధాన సామాజిక వర్గం అయిన మున్నూరు కాపు వర్గానికి చెందిన సంజయ్‌కు పెద్దపీట వేయడం ద్వారా అత్యధికంగా ఉన్న ఆయా వర్గాల ఓట్లను పొందాలని చూస్తోంది. ఇప్పటికే ఎస్సీ వర్గీకరణ ద్వారా మాదిగల మద్దతు పొందిన కాషాయ పార్టీ.. ఇక బీసీలనూ తమ వైపు తిప్పుకొంటే తెలంగాణలో తిరుగుండదని భావిస్తోంది. 2028 ఎన్నికల నాటికి ఈ మేరకు బలోపేతం అవ్వాలని చూస్తోంది.?

### తెలంగాణ పార్టీలోనూ పోటీ లేనట్లే

సంజయ్‌కు మరోసారి రాష్ట్ర పార్టీ పగ్గాలు అప్పగించే అంశంపై తెలంగాణ బీజేపీలోనూ పెద్దగా పోటీ లేనట్లు చెబుతున్నారు. మరో బీసీ నాయకుడు పోటీ పడినా.. ఆయన కొత్తగా వచ్చినవారు. సంజయ్ ఆర్ఎస్ఎస్ నుంచి ఎదిగినవారు. పార్టీ సిద్ధాంతాలను పూర్తిగా నమ్మే వ్యక్తి కావడంతో, దూకుడు, పోరాట పటిమ కలిగిన నాయకుడు కావడంతో ఆయనవైపు మొగ్గుతున్నట్లు తెలిసింది.